నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | జూన్ 01, 2024 | www.navatelangana.com

పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఆసిఫాబాద్: పొగాకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్యాధికారి తుకారాం బట్ అన్నారు. అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ పొగాకు దినోత్సవ అవగాహన ర్యాలీని జిల్లా వైద్యాధికారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులైన చుట్ట, బీడీ, సిగరెట్ ఎక్కువగా వినియోగించిన వారికి ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయన్నారు. యుక్త వయస్సు వారు పొగాకు(నికోటిన్) ఉత్పత్తులను ఎక్కువగా వాడితే వారికి నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పొగ తాగే వారికే కాకుండా వారి వద్ద ఉన్న వారికి కూడా ఆరోగ్యం చెడిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్, అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వినోద్ కుమార్, ఎన్‌సిడి ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంతోష్, హెల్త్ ఎడ్యుకేటర్ రషీద్, సూపర్వైజర్లు సరిత, ప్రమీల, గోవర్ధన్ పాల్గొన్నారు.



2, 3 తేదీల్లో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిర్మల్

జూన్ 2, 3 తేదీలలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని త్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం(పిఓడబ్ల్యూ)రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శిక్షణ తరగతులకు జిల్లా నుండి 15 మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. మహిళలపై జరుగుతున్న హత్యలు, లైంగిక దాడులు, మూఢ నమ్మకాలు, ప్రైవేట్ రంగంలో మహిళలకు ప్రాధాన్యత, మహిళా హక్కులను కాపాడాలని చర్చిస్తామని పేర్కొన్నారు. మహిళలను ఎన్నో రంగాల్లో రాణిస్తున్నప్పటికీ కొంతమంది మనువాద సిద్ధాంతాన్ని ప్రచారం చేసుకుంటూ మహిళలను ఇంటికే పరిమితం కావాలని మనువాద పాలకవర్గ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. మహిళలను చైతన్య పరచడానికి ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

సర్కారు బడి..చేరుదాం పదండి..!

- ఈ నెల 3 నుంచి బడిబాటకు శ్రీకారం
- పక్షం రోజుల పాటు నిర్వహించేలా ప్రణాళిక
- సౌకర్యాలు వివరిస్తూ.. పిల్లలను చేర్పించేలా కార్యాచరణ
- పూర్తికావస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు

వేసవి సెలవులు ముగిసిన అనంతరం మరికొన్ని రోజుల్లో బడులు పున : ప్రారంభం కానున్నాయి. జూన్ 12న నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న దృష్ట్యా అంతకుముందే బడుల్లో విద్యార్థులను చేర్పించేలా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా జూన్ 3వ తేదీ నుంచి బడిబాట పేరిట ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. అదే నెల 19వ తేదీ వరకు పక్షం రోజుల పాటు నిర్వహించే ఈ క్రతువులో రోజువారీ కార్యక్రమాలను రూపకల్పన చేసింది. రోజుకో కార్యక్రమం చొప్పున పదిహేను అంశాలను చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే మండలాల వారీగా ఉపాధ్యాయులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను పూర్తిచేసిన జిల్లా విద్యాశాఖ సర్కారు బడుల్లో విద్యార్థులను చేర్పించడమే లక్ష్యంగా రంగంలోకి దిగుతోంది. మరోపక్క బడుల ఆధునీకరణకు ప్రభుత్వం చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు కూడా పూర్తికావస్తుండటంతో విద్యార్థులకు సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు బడులను బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా వివిధ కార్యక్రమాలను అమలు చేయాలని భావిస్తోంది. బడుల్లో సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం మన ఊరు-మనబడి స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట అభివృద్ధి పనులు కొనసాగిస్తోంది. బడులు తెరిచేలోగా వీటిని అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. మరోపక్క పాఠశాలల పర్యవేక్షణ, నిరంతరం సౌకర్యాల కల్పన, నిర్వహణ బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించింది. ఎస్ఎంసీ కమిటీల స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు వేసింది. మహిళా సంఘం ప్రతినిధి ఛైర్మెన్‌గా..పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ప్రభుత్వం మౌళిక సదుపాయాల కోసం నిధులు విడుదల చేయడంతో పనులు కొనసాగించేందుకు ఆస్కారం లభించింది.

చేపట్టాల్సిన కార్యక్రమాలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 650 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 580 ప్రాథమికోన్నత పాఠశాలలు, 780 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో ప్రతి ఏటా సుమారు 3.50లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బడిబాట కార్యక్రమంలో రోజువారీగా చేపట్టాల్సిన విధులను విద్యాశాఖ రూపొందించింది. ఆవాసాల్లో అర్హులైన పిల్లలందరినీ గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించడం, నమోదును పెంచి నాణ్యమైన విద్యనందించడం, ప్రభుత్వం అందించే వివిధ పథకాలపై అవగాహన కల్పించడం, ఎస్‌హెచ్‌జీలు, ఏపీసీల భాగస్వామ్యంతో బడులను బలోపేతం చేయడం, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి బడీడు పిల్లలను గుర్తించి చేర్పించడం, విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయడం, 5వ తరగతి పూర్తయిన పిల్లలను ఉన్నత పాఠశాలల్లో చేర్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. బాలిక విద్య ప్రాముఖ్యతను చెప్పి బడుల్లో చేర్పించడం, తల్లిదండ్రులు, పిల్లలు, సంఘాల సభ్యులకు విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించడం, పాఠశాల విద్యా ప్రక్రియలో తల్లిదండ్రుల పాత్రను చెబుతూ హాజరు ప్రాముఖ్యతపై వివరించడం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్యాబోధన, ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు, అన్ని రకాల వసతులు తదితర వాటిని వివరించడం, పిల్లలు ఇంట్లో నేర్చుకోవడంపై అందుబాటులో ఉన్న వనరులపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు.



బడిలో చేర్పించడమే లక్ష్యం

ప్రతి ఏటా చేపడుతున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా నూతన విద్యార్థులను బడిలో చేర్పించడమే లక్ష్యంగా మారుతోంది. కిందటేడాది ఏకంగా 8490మంది విద్యార్థులను వివిధ రకాల ప్రభుత్వ బడుల్లో చేర్పించారు. కరోనా తర్వాత అనేక మంది విద్యార్థులు సర్కారు బడుల వైపు మొగ్గుచూపడం కూడా ఓ కారణంగా నిలిచింది. ఈ ఏడాది సైతం 10వేల మందిని చేర్పించడమే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ప్రయివేటు పాఠశాలల కంటే ధీటుగా సౌకర్యాలు ఉండటం కూడా కలిసి వచ్చే అవకాశంగా కనిపిస్తోంది. డిజిటల్ తరగతి గదులు, ఒకటి నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం, ఉచిత పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనం, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం, ప్రయోగశాలలు ఉండటంతో పాటు ప్రతి మూడో శనివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు వారి దృష్టికి తీసుకొచ్చి మెరుగుపడేలా చేయడం వంటివి ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను తెలియజేస్తున్నాయి.

విద్యార్థులను చేర్పించడమే లక్ష్యం : సుజాత్‌ఖాన్, సెక్టోరల్ అధికారి, ఆదిలాబాద్



ఉన్నతాధికారుల ఆదేశం మేరకు జిల్లాలో ఈ నెల 3వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఇప్పటికే వివిధ మండలాల వారీగా ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి సన్నద్ధం చేశాం. విద్యాశాఖ రూపొందించిన కార్యక్రమాలను చేపట్టి నూతన విద్యార్థులను సర్కారు బడుల్లో చేర్పించడమే లక్ష్యంగా కృషిచేస్తాం. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు కూడా పూర్తికావస్తుండటంతో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

ప్రతి ప్రభుత్వోద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాలను లబ్దిదారుడికి అందించడంతో పాటు అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించి, ప్రజలతో మమేకమై సేవలు అందించే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్లో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిగా పని చేసిన కౌశిక్ వెంకట రమణ పదవీ విరమణ పొందిన సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన మహోత్సవ కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. విరమణ ఉద్యోగి దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అర్హత గల వారికి అందించడంలో అహర్నిశలు శ్రమిస్తారని అన్నారు. 1987లో ఉద్యోగంలో చేరిన కౌశిక్ వెంకట రమణ 37 సంవత్సరాలు సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించి జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిగా పదవీ విరమణ పొందారని, అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉత్పత్తి పెంచే క్రమంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు



నవతెలంగాణ-నస్పూర్

ఉత్పత్తి, ఉత్పాదకత పెంచే క్రమంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కాన్ఫరెన్స్ హాల్‌లో జీఎం అధ్యక్షతన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత ఉద్యోగుల రక్షణ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించి ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరియాలో గత సంవత్సరం జరిగిన ప్రమాదాలు, వాటిని నివారించడానికి తీసుకుంటున్న చర్యలపై అన్ని గనుల విభాగాల అధిపతులతో జీఎం కూలంకషంగా చర్చించారు. అలాగే రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను సాధించాలని, ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సర నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్క ఉద్యోగి, అధికారి కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జూన్ రెండవ తేదీన నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ప్రతి ఒక్క ఉద్యోగి అధికారి పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రగతి మైదానంలో నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎస్ఓ టు జీఎం పురుషోత్తమరెడ్డి, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, డీజీఎంలు చిరంజీవులు, పి అరవిందరావు, ఆనంద్‌కుమార్, ఇన్చార్జి డిజిఎం వర్క్ షాప్ మల్లయ్య, డీవైసీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్ పాల్గొన్నారు.

గోదావరి ముంపు ఇబ్బందులు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-జైపూర్

అన్నారం బ్యారేజ్ నిర్మాణంతో మొదలైన గోదావరి వరద ముంపు ఇబ్బందులు పరిష్కరించాలని కోరుతూ బాధిత రైతులు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి ఇరిగేషన్ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డిని కలిశారు. చెన్నూర్ మండల పరిధి బీరెల్లి, ముత్తారావుపట్టి, సుందరశాల, నర్సక్కపేట్, దుగ్నపల్లి, వెంకంపేట్ గ్రామాలకు చెందిన ముంపు బాధిత రైతులు శుక్రవారం హైదరాబాద్ తరలివెళ్లారు. అన్నారం బ్యారేజ్ నిల్వ నీటితో నాలుగు సంవత్సరాల నుండి పంటలను నష్టపోతున్నామని మంత్రికి విన్నవించారు. రైతుల అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించి మంత్రి బ్యారేజ్ వరద ముంపు నివారణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. ముంపు ప్రాంతంలో రూ.200కోట్లతో కరకట్ట కట్టి గోదావరి వరద పంట పొలాల్లోకి రాకుండా నివారిస్తామని భరోసా ఇచ్చారని తెలిపారు.

విత్తనాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ చర్యలు

- కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులు కోరుకునే డిమాండ్ రకం విత్తనాలతో పాటు ఇతర అన్ని రకాల కంపెనీల విత్తనాలు అందుబాటులో ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి రైతులకు భరోసా కల్పించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పర్యటించిన ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషాను కలిసి మాట్లాడారు. జిల్లాలో విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని, విత్తన దుకాణాల వద్ద బారులు తీరకుండా అవసరమైన విత్తనాలను తెప్పించే విధంగా చొరవ చూపాలని కోరారు. ఒకేరకం విత్తనాలను కోరుకోవడం వల్లనే ఇలాంటి పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇతర రకాలపై అవగాహన కల్పిస్తే ఈ సమస్య తప్పకుండా తీరుతుందన్నారు.

ప్రభుత్వ లక్ష్యం రైతుల సంక్షేమమే

అంతకుముందు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తన కొరతను తీర్చేలా పకడ్బందీ చర్యలు చేపడుతోందని అన్నారు. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నట్టు స్పష్టం చేశారు. కానీ ప్రతిపక్షాలు విత్తనం కొరత ఉందని అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, రైతులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని బద్నాం చేయాలనే ఆలోచనతోనే ఈ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. విత్తన రాజకీయం మానుకోవాలని బీజేపీ, బీఆర్ఎస్‌లను హెచ్చరించారు. జిల్లాకు లక్షా50వేల రాశి 659 రకం విత్తనాల అవసరం ఉందని, ఇప్పటివరకు 60 వేలు ఆదిలాబాద్ జిల్లాకు వచ్చాయని, త్వరలోనే మరో 90 వేల ప్యాకెట్లు సైతం సరఫరా అవుతాయని పేర్కొన్నారు. రైతులు నిశ్చింతంగా ఉండాలని భరోసానిచ్చారు. జిల్లా కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను జిల్లా నాయకులతో కలిసి సందర్శించారు.



ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, మావల మండల అధ్యక్షుడు కుంబోజి రాములు, బేల మండల అధ్యక్షుడు ఘన్‌శ్యామ్, నిర్మల్ జిల్లా జనరల్ సెక్రెటరీ పోతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొండ గంగాధర్, గిమ్మ సంతోష్, నవీన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, ఎన్ఎస్‌యుఐ శాంతన్‌రావు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి చేటు



ఇచ్చోడ : ధూమపానం చేయడం వల్ల అనేక రోగాలకు దారితీస్తుందని తలమద్రి పల్లె దవాఖాన వైద్యులు ప్రశాంత్ అన్నారు. శుక్రవారం మండల లోని నవేగాం గ్రామంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్ఎల్‌హెచ్‌పి ప్రశాంత్ మాట్లాడుతూ పొగాకు ఒక జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేస్తుందన్నారు. ధూమపానం, పొగాకు ఉత్పత్తులను ఉపయోగించడం మానేస్తే రక్తపోటు, గుండెపోటు ప్రమాదాన్ని వంద శాతం తగ్గించవచ్చని తెలిపారు. తినే ఆహారం, జీవనశైలితో పాటు ధూమపాన అలవాటు ఆరోగ్య విషయంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి రోజు యోగా, మెడిటేషన్, మార్నింగ్ వాక్ వంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుభాష్, ఎఎన్ఎం పార్వతి, ఆశా కార్యకర్త రేణుక పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

- సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు



ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో సదస్సుకు సంబంధించిన గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమలు- సవాళ్లు అనే అంశంపై సదస్సు ఉంటుందని తెలిపారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సహాయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు శివదాసన్, సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని ఉపాధిహామీ కూలీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.స్వామి, సహాయ కార్యదర్శి కె.ఆశన్న, ఉపాధ్యక్షురాలు అట్ల పొచ్చక్క, ఆర్.మంజుల తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు



నస్పూర్: అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన సిలంభం క్రీడాకారులను కలెక్టర్ బదావత్ సంతోష్ శుక్రవారం అభినందించారు. మే 25 నుండి 28 వరకు మలేషియా దేశంలోని సెపొంగ్ పట్టణంలో జరిగిన అంతర్జాతీయ స్థాయి సిలంబం ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పులిశెట్టి శతి గోల్డ్, సిల్వర్ మెడల్, దొంతుల వర్ష గోల్డ్, సిల్వర్ మెడల్, బోసు సంతోష్ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ కార్యక్రమంలో సిలంభం రాష్ట్ర కార్యదర్శి కనపర్తి రమేష్, జిల్లా అధికారుల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, డివైఎస్ఓ రాజ్‌వీర్, ఈడి దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోచంపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | జూన్ 01, 2024 | www.navatelangana.com

పొగాకు నివారణకు కృషి చేద్దాం

నవతెలంగాణ-నార్నూర్

ప్రతి ఒక్కరూ కలిసి పొగాకు నివారణకు కృషి చేద్దామని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వాస్పత్రిలో సిబ్బందితో కలిసి జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వాడకం, ధుమపానం వంటి దురలవాట్లకు యువత బానిసలుగా కాకుండా అవగాహన కల్పిస్తామని తెలిపారు. పొగాకు వల్ల జరిగే నష్టాలను వివరించారు.



వ్యక్తిగత ఆరోగ్య అలవాట్లను పాటించడంతో పాటు ఆరోగ్య భారతాన్ని నిర్మించడంలో తనవంతు పాత్రను పోషిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ఓ సుశీల, హెచ్ఈఓ నాందేవ్, హెల్త్ సూపర్ వైజర్లు చరణ్‌దాస్, సతవ్వ, రాజమ్మ, వైద్య సిబ్బంది ప్రియాంక, మాన్కుబాయి, ఈశ్వర్, విమల, విద్యారాణి ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని మన్మథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 1996-97 సంవత్సరంలో పాఠశాలలో 10వ తరగతి చదివి వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ప్రయివేటు ఉద్యోగాలు చేస్తూ, స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒక చోట చేరి సందడి చేశారు. ఆనాటి మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



బడీడు పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలి



నవతెలంగాణ-నేరడిగొండ

బడి ఈడు పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం ఎంపీపీ కార్యాలయంలో బడిబాట ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడికి వెళ్లాల్సిన పిల్లలు బడికి వెళ్లకుండా అక్కడక్కడ పనులకు వెళుతున్నారని అన్నారు. కొందరు పిల్లలు బడికి వెళ్లకుండా బయట రోడ్లపైన అక్కడ ఇక్కడ తిరుగుతున్నారని, అలా బడి ఈడు పిల్లలను పనులలో చేర్పించడం కాదు బడిలో చేర్పించాలని సూచించారు. బడికి వెళ్లాల్సిన పిల్లలు బడికి వెళ్లకుండా బడి బయట రోడ్లపై తిరుగుతూ కూలి పనులకు వెళ్లడం యోగ్యత కాదని అలా వెళ్లే ప్రతి ఒక్కరిని తీసుకొచ్చి బడిలో చేర్పించాలని బడికి వెళ్లే పిల్లల్ని బాల కార్మికులుగా చేయవద్దని సూచించారు. అంతేకాకుండా జూన్ 2న ఆదివారం జరగబోయే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జెండా ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంఈఓ భూమారెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఎం, ఎంఎస్ రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్స్ వీఓ సూపర్‌వైజర్లు, హెచ్‌డబ్ల్యూఓ, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

లోకేశ్వరం : బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా స్పెషల్ ఆఫీసర్ నాగమణి అన్నారు. బడిబాట, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి పనులపై శుక్రవారం లోకేశ్వరం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జూన్ 5వ తేదీ నాటికి అమ్మ ఆదర్శ పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య పెంచే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీఓ సోలమన్‌రాజ్, ఎంఈఓ చంద్రకాంత్, ఏపీఎం మల్లేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తనిఖీలు



నవతెలంగాణ-నార్నూర్

ఉమ్మడి మండలంలో శుక్రవారం వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నార్నూర్ మండలంలోని 23 విత్తన దుకాణాలలో 25 వేల పైన సీడ్స్ ప్యాకెట్లు, గాదిగూడ మండలంలోని 11 విత్తన దుకాణాలలో 18 వేలకు పైన మొత్తం ఉమ్మడి మండలంలో 43 వేలకు పైన సీడ్స్ ప్యాకెట్లు వచ్చాయని, ఇప్పటి వరకు రైతులు కొనుగోళ్లు చేసిన అనంతరం ఇంకా 35 వేలకు పైన సీడ్స్ ప్యాకెట్లు కొనుగోళ్లకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు అధైర్య పడొద్దని తెలిపారు. నార్నూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ రాజ లింగం, ఏఓ రమేష్, గాదిగూడ మండల కేంద్రంలో తహసీల్దార్ విజయనందం, ఏఓ దివ్య పరిశీలించారు. విత్తన దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అధిక ధరలకు అమ్మిన, నకిలీ విత్తనాలు ఇచ్చి రైతులను మోసగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోగి మృతి

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన ఆత్రం లింబారావ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ వారి ఇంటికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. చేతికొచ్చిన కొడుకు అకాల మరణంతో వారి తల్లిదండ్రులను ఓదార్చడం బాధాకరమైన సంఘటన అని, వారి తల్లిదండ్రులకు మనోధైర్యం కల్పిస్తూ మేమున్నామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామపెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోయవాడ, ఎన్టీఆర్ కాలనీ, హనుమాన్‌నగర్, మేదరివాడ, మోబిన్‌పురా కాలనీల్లో ఉదయం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో ప్రధానంగా నీటి, డ్రైనేజీ, రోడ్డు, కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను గుర్తించామని, ఈ సమస్యలన్నింటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన కొన్ని నెలల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీపథకం కింద రూ.10లక్షల బీమా, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.5వందలకే గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. త్వరలో ఇండ్లు లేని నిరు పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. 4వేల పెన్షన్‌లు, మహిళలకు రూ.2వేల 5వందలను ఇస్తామన్నారు. కేంద్రంలో అధికారంలో వస్తే, 5న్యాయాలతో పాటు మరిన్ని పథకాల ద్వారా ప్రజలకు లబ్ది చేకురుస్తామన్నారు. అనంతరం పలువురిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: NIRMAL
AT:: NIRMAL
S.O.P.No. 01 OF 2024
BETWEEN:-
Marri Gangaiah & 2 others
... Petitioners
AND
SABLE WAGHIRE & COPANY PRIVATE PVT. LTD Post Box No. 84, Shivaji Nagar, Nizamabad. (T.S)
..Respondents
To,
All Concerned
You are hereby informed that the Petitioners in the above S.O.P., filed in the above said Hon'ble Court seeking for the relief of appointing the Petitioner No.1 as a successor of the deceased i.e., **Marri Nagavva D/o. Marri Ganganna,** and permit to petitioners No. 1, 2 & 3 share in the property i.e., **Rs.29, 694/- (Rupees Twenty Nine Thousand Six Hundred Ninety Six Only)** the same is stood posted to 14.06.2024. If any person(s) had any objection to it, he/they may approach the above said Hon'ble Court by 10.30 a.m., on 14.06.2024 either in person or through their counsel duly instructed. Otherwise, the matter will be decided ex - parte.
By order of the Court
Sd/-
(CHANDRE ASHOK)
ADVOCATE

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశాల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గిరిజన ప్రాంతంలో గత 33 సంవత్సరాలు మైదాన ప్రాంతంలో గత 19 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారన్నారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందరన్నారు. రిజిస్టర్ రాయడం సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పని చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందిస్తున్నారన్నారు. తగిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తున్నారని, వీటితోపాటు గర్భిణి, బాలింతలు, చిన్నపిల్లలు, ఇతరప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారన్నారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డులను కూడా ప్రకటించిందన్నారు. అన్ని పనులను నిర్వహిస్తూ, ఇంత సీనియారిటీ ఉన్న ఆశ వర్కర్లకు కొత్తగా ఎగ్జామ్స్ నిర్వహించి, కొత్తగా ఆశాల జ్ఞాపకశక్తిని మళ్లీ నిరూపించుకోవాలని చెప్పడం సమంజసం కాదన్నారు. వెంటనే పరీక్షల నిర్వహణ ఆలోచనను వెంటనే విరామించుకోవాలని, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కారం చేయాలని అన్నారు. కనీస నిర్ణిత వేతనం రూ.26 వేలు చెల్లించాలని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ రూ.50లక్షల సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతినెల 2న వేతనాలు చెల్లించాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి ఏం.సుజాత, ఆశా నాయకులు అర్చన, పుష్ప, సురేఖ, లక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై పోలీసుల ప్రత్యేక నిఘా

- ఎస్పీ గౌస్ ఆలం
- గోదాములను తనిఖీ చేసిన ఎస్పీ
- జిల్లా వ్యాప్తంగా ఐదు చెక్ పోస్టులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విత్తనాల అక్రమ రవాణాలను, అక్రమ నిల్వలను అడ్డుకోవడానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తూ, ఆకస్మిక తనిఖీల నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. శుక్రవారం అక్రమ రవాణా జరగకుండా పట్టణంలోని విత్తన గోడౌన్‌లను పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలు గోడౌన్స్‌ను పరిశీలించి, విత్తనాల రాకపోకలను తనిఖీ చేశారు. ప్రధానంగా గోడౌన్స్‌లో ఎటువంటి నకిలీ విత్తనాలు లేకుండా విత్తన సంచులను పరిశీలించి తనిఖీ చేశారు. గోదాం సిబ్బందితో మాట్లాడుతూ నిల్వలు ప్రతి రాకపోకలను, సమయం, తేదీ, పేరుతో నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విత్తనాల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి, అక్రమ నిల్వలు జరగకుండా అడ్డుకోవడానికి రెవెన్యూ, పోలీస్ అధికారులచే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, జిల్లా వ్యాప్తంగా ఉన్న 36 విత్తన గోడౌన్స్ వద్ద అధికారులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాలను పూర్తిగా అడ్డుకోవడానికి మండలాల వారీగా వ్యవసాయ అధికారులతో కలిసి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాల అక్రమ రవాణా జరగకుండా శంకర్‌గూడ, ఆనంద్‌పూర్, పిప్పర్‌వాడ, లక్ష్మీపూర్, ఘన్‌పూర్ వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. నకిలీ విత్తనాల అడ్డుకట్టకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, నకిలీ విత్తన వ్యాప్తిని అడ్డుకుంటున్నట్టు తెలియజేశారు. ప్రజలు, రైతులు అక్రమ నిల్వలపై, రవాణాపై, నకిలీ విత్తన తయారీపై ఎటువంటి సమాచారాన్ని అయినా జిల్లా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఆదిలాబాద్ ఎల్.జీవన్‌రెడ్డి, ఒకటవ పట్టణ సీఐ కే.సత్యనారాయణ, రెండో పట్టణ సీఐ అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

- కౌంటింగ్ కేంద్రాలను సందర్శించిన మూడు జిల్లాల కలెక్టర్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జూన్ 4న నిర్వహించనున్న లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో టీటీడీసీ, సోషల్ వెల్ఫేర్ స్కూల్, సంజయ్‌గాంధీ పాలిటెక్నికల్ కళాశాలల్లోని మూడు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం కౌంటింగ్ కేంద్రాల్లోని ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి రాజర్షిషా, ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ గౌస్ ఆలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈసీఐ నియమ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో కొనసాగే కౌంటింగ్ ప్రక్రియలో ఎక్కడ కూడా పొరపాట్లకు తావివ్వకుండా, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలన్నారు. కౌంటింగ్‌లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని, కౌంటింగ్ కేంద్రాల వద్ద సంబంధిత ఏఆర్వోలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో గట్టి బందోబస్తుతో పాటు బారికెడ్స్, ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చే అధికారులు, సిబ్బందికి మౌళిక వసతులు కల్పించాలని అన్నారు. తాగునీరు ఏర్పాటు, టాయిలెట్స్, వైద్య సిబ్బంది మెడికల్ కిట్‌తో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు ఇతరులను అనుమతించరాదని స్పష్టం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రౌండ్ ది క్లాక్, మూడంచెల పటిష్ట భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణపై ఆరా తీశారు. అనంతరం సీఆర్‌పీఎఫ్ భద్రత సిబ్బంది వద్ద ఉన్న విజిట్ బుక్‌లో సంతకం చేశారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారి ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, దీపక్ తివారీ, వేణు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా
- వినతిపత్రం అందజేసిన ఏఐపీకేఎస్ నాయకులు



నవతెలంగాణ-ఖానాపూర్

ప్రభుత్వము రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన మెమోరండంను సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా నందిరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరించాలని, అన్ని రకాల పంటల విత్తనాలు ఎరువులు, పురుగు మందులు ఉచితంగా ఇవ్వాలని, అలాగే వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు మినీ ట్రాక్టర్స్ 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన అన్ని రకాల పంటలకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. పత్తి కొనుగోలు వ్యాపారులు ఎంఎస్‌పీ ప్రకారం క్వింటాలుకు రూ.7020 ఉండగా, తక్కువ ధరకు కొంటున్నారని ఇలాంటి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని, అన్ని రకాల విత్తనాల్ని రైతులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సీజన్‌లో పత్తి రాశి 659కి డిమాండ్ పెరిగినందున సకాలంలో డిమాండ్‌కు తగ్గట్టుగా విత్తనాలు అందించాలని అన్నారు. అన్నదాతలు చేస్తున్న ఆందోళనను అర్థం చేసుకోవాలని వెంటనే స్పందించాలని అన్నారు. ఇప్పటికీ మార్కెట్ యార్డులలో వడ్లు నిల్వలు ఉన్నాయని కొనుగోలు వేగవంతం చేయాలని అన్నారు. వర్షాలు ముంచుకొస్తున్నటువంటి పరిస్థితిని ప్రభుత్వం గమనించి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కటింగ్ లేకుండా బేషరతుగా ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐపీకేఎస్ మండల నాయకులు జక్కుల రాజన్న, మచ్చ శ్రీనివాస్, గోనె లచ్చన్న, భీమయ్య పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సందర్శించిన పీఓ



నవతెలంగాణ-ఉట్నూర్

భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో వికాసం ప్రత్యేక పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బు గుప్తా శుక్రవారం సందర్శించారు. ప్రతి రోజూ పిల్లలకు ఆట పాటలతో పాటు పెయింటింగ్, డ్రాయింగ్ శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, ప్రతి రోజూ పిల్లలకు ఉదయం పాలు బిస్కెట్, పండ్లు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికాసం పాఠశాల ప్రిన్సిపల్ వికాస్, ఎస్ఈఆర్ పి.బలరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సకాలంలో పూర్తి చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ రమేష్, ఎంఈఓ ఆశన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, వీఓ సభ్యులకు సూచించారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలోని రైతువేదికలో ఎస్సీఆర్పీ, సీఆర్పీ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో పైఅధికారుల ఆదేశానుసారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరిపి విద్యార్థులకు ప్రవేశం కల్పించాలని కోరారు. ఉచిత యూనిఫాం జతలను పాఠశాలల వారీగా సరైన సమయంలో అందించాలని ఏపీఎంను కోరారు. అమ్మఆదర్శ పాఠశాల కమిటీ సహాయ సహకారంతో పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ విజయనందం, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలో ఎంపీపీఎస్ పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాల పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేసిన పనులను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తాగునీరు, ఎలక్ట్రికల్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు అన్ని సౌకర్యాలు నాణ్యతతో కూడిన పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. పాఠశాలల ప్రారంభం నాటికి అన్ని వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఇక్కడి నుంచి నేరుగా పత్తి విత్తనాలు నిల్వ ఉన్న డిస్ట్రిబ్యూటర్ కేంద్రాలను, విత్తన డీలర్ల దుకాణాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ వివరాలపై ఆరా తీశారు. అక్కడున్న రైతులకు పలు సూచనలు చేశారు. కేవలం ఒకే రకమైన విత్తనాలు కాకుండా మేలు రకాలకు చెందిన అన్ని కంపెనీ విత్తనాలు వాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సవాయి సింగ్, ఎంపీడీఓ మహేందర్ కుమార్, విద్యాధికారి శ్రీనివాస్, వ్యవసాయ అధికారి సంధ్యారాణి, పద్మావతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు మంజూష, ఏపీఎం రాజారెడ్డి పాల్గొన్నారు.

బడిబాటను వాయిదా వేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమానికి వాయిదా వేయాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎస్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు జాదవ్ చంద్రకాంత్ నాయక్ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమం జూన్ పన్నెండుకి వాయిదా వేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పదిహేను నెలల పీఆర్సీ బకాయిలను వెంటనే మంజూరు చేయాలని అన్నారు. ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎస్‌టీ రిజర్వేషన్ 10 శాతం ఏజెన్సీ టూ ఏజెన్సీ ప్లేన్ టూ ప్లేన్‌ల ప్రాంతంలో బదిలీలు చేయాలనీ, జీఓ నెంబర్ 3ను పునరుద్దరణ చేయాలనీ, పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల జీపీఎఫ్ లోన్, ఈఎల్స్ మెడికల్ బిల్స్ క్లియర్ చేయాలనీ ప్రభుత్వం తగు చర్య తీసుకోవాలని కోరారు. సీఆర్పీ సమస్యలను పరిష్కారం చేయని, టైంస్కేల్ కల్పించి సీఆర్పీలకు రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీఎఫ్ జిల్లా నాయకులు దినేష్ కుమార్, రవీందర్, బానోత్ సీతారామ్, విఠల్, బండు, మోహన్, నర్సింగ్, ధర్మంసింగ్, దేవిదాస్, రాందాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని అర్కగూడ గ్రామానికి చెందిన ఆత్రం మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబానికి శనివారం కాంగ్రెస్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.2వేల నగదు, బియ్యం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, మండల పార్టీ అధ్యక్షుడు భూష శంకర్, నాయకులు హకీమ్, వినోద్, గంగారాం, మంగయ్య, వెంకటి పాల్గొన్నారు



విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు వహించాలి

కాగజ్‌నగర్ రూరల్ : రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు వహించాలని వ్యవసాయ విస్తరణాధికారి యువరాణి సూచించారు. శుక్రవారం మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో నకిలీ విత్తనాలు, విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువరాణి మాట్లాడుతూ రైతులు లూజుగా ఉన్న సంచుల్లో విత్తనాలు కొనుగోలు చేయరాదని, విత్తనాలు కొనుగోలు చేసిన షాపు నుంచి రశీదు తీసుకొని, విత్తన ప్యాకెట్, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. భూసారం పెంచే సాంప్రదాయ ఎరువులైన జీలుగ సాగు భూమికి ప్రయోజనకరమన్నారు.



ఏసీపీ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నం

మంచిర్యాల : మంచిర్యాల పట్టణ పరిధిలోని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం యువకుడు ఆత్మహత్య యత్నం కలకలం రేపింది. ఘటనపై మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన మోహన్(42)పై గత నెల 10వ తేదిన అట్రాసిటీ కేసు నమోదైంది. పలు సార్లు విచారణకు రావాల్సిందిగా కోరడంతో శుక్రవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన యువకుడు తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో గొంతు కోసుకునే ప్రయత్నం చేశాడు. గమనించిన సిబ్బంది వెంటనే మంచిర్యాలలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ప్రస్తుతం మంచిర్యాలలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఏసీపీ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మందమర్రి : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం మందమర్రిలో వెలుగు చూసింది. ఒకటవ జోన్‌లో మర్రి విజయలక్ష్మి(ప్రణవి)(28) ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతి పట్ల విజయలక్ష్మి తండ్రి, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020లో పట్టణానికి చెందిన మర్రి గౌతమ్‌కు హన్మకొండ కొవ్వూరు గ్రామానికి చెందిన(ప్రణవి) విజయలక్ష్మితో వివాహం జరిగింది. నిత్యం ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చి పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. అత్త, మామ, భర్త ఇంట్లో ఉండగానే ప్రణవి మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోంది. మృతురాలు భర్త గౌతం రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్‌లో కాంటాక్ట్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి రెండున్నర సంవత్సరాల బాబు రూపేష్ ఉన్నాడు.



భర్త, అత్తమామలే హత్య చేశారు : తండ్రి రాజయ్య

తన కూతురుని భర్త గౌతం, అత్త భాగ్యలక్ష్మి, మామ కుమారస్వామిలే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలు తండ్రి ఆరుకల రాజయ్య ఆరోపిస్తున్నారు. వివాహాన్ని ఎంతో ఘనంగా జరిపించి 25 లక్షల నగదు, 20 తులాల బంగారాన్ని కట్నంగా ఇచ్చామన్నారు. వివాహమైన 6 నెలలకే అదనపు కట్నం కోసం వేధించే వాడని తెలిపాడు. వివాహం అనంతరం రెండున్నర లక్షలు ఇచ్చామన్నారు. కూతురు మృతి పట్ల అల్లుడు, కుటుంబ సభ్యులపైనే అనుమానం ఉందని, పోలీసులకు ఫిర్యాదు చేశారు. గౌతం కుటుంబ సభ్యులపై మృతురాలి కుటుంబ సభ్యులు దాడి చేస్తారనే సమాచారంతో ముందస్తుగా వారిని పోలీస్‌స్టేషన్‌కు తరళించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పచ్చిరొట్ట, పత్తి విత్తనాల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి

హాజీపూర్ : జిల్లాలో పంట సాగుకు ఉపయోగించే పచ్చిరొట్ట, పత్తి విత్తనాల పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. శుక్రవారం హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ విధానాన్ని పరిశీలించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ద్వారా 60 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ మేరకు జిల్లాలో సాగుకు అవసరమైన పచ్చిరొట్ట అందుబాటులో ఉందని రైతులు ఆన్‌లైన్‌లో టీ-సీడ్ పోర్టల్ ద్వారా పంపిణీ జరుగుతున్న విధానాన్ని, స్టాక్ వివరాలను పరిశీలించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. పంట సాగులో పచిరొట్ట వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని, సేంద్రీయ పద్ధతిలో సాగు చేసేలా రైతులకు అవగాహన కలిపించాలని వ్యవసాయాధికారులకు సూచించారు.

ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు

హాజీపూర్లోని మల్లికార్జున ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పత్తి విత్తనాలు, ఎరువుల స్టాక్ వివరాలను పరిశీలించారు. జిల్లాలో నకిలీ, నిషేధిత పత్తి విత్తనాలు, ఎరువుల విక్రయం, వినియోగం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఈ వ్యవహారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. నిషేధిత విత్తనాలు, ఎరువుల విక్రయాలు జరిపే వారిపై చట్టరిత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ సాంకేతిక అధికారి సంకె శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కృష్ణ. పీఏసీఎస్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పాముకాటుతో ఎద్దు మృతి

ఇచ్చోడ : మండలంలోని గుబ్బ గ్రామం రైతు సిడాం లక్ష్మణ్‌కు చెందిన ఎద్దు గురువారం పాముకాటుతో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం..గురువారం మధ్యాహ్నం వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం ఎద్దును చెట్టు కింద కట్టేసి ఇంటికి వచ్చి భోజనం చేసి తిరిగి వెళ్లాడు. ఎద్దు మృతి చెంది పడి ఉంది. ఎద్దు విలువ సుమారు రూ.60వేల వరకు ఉంటుందని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధిత రైతు లక్ష్మణ్ వేడుకుంటున్నాడు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దండేపల్లి : ద్వారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-1996 సంవత్సరం పదవ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన వారిలో ఆనందం వెల్లివిరిసింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో పాఠశాలలో చదివిన మరుపురాని తీపి గుర్తులు నెమరేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఎవరెవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. గురువులు చూపిన మంచి మార్గంలో పయనించడం వల్ల నేడు జీవితంలో స్థిరపడ్డామని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా గురువులను వారు ఘనంగా సన్మానించారు.

బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలి

దండేపల్లి : జూన్ 3 నుండి 19 వరకు చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తాహసీల్దార్ సంధ్యరాణి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐకెపి సీఏలు, వివోఏలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు విద్యా సంవత్సరం ప్రారంభంలో జూన్ 3 నుండి 19 వరకు బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో డ్రాపవుట్స్ లేకుండా ప్రభుత్వ పాఠశాలలో బడీడు పిల్లలను చేర్పించడానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు సంబంధిత అధికారులు కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో ప్రసాద్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో పలువురికి గాయాలు

నవతెలంగాణ-మంచిర్యాల


పట్టణంలోని చున్నం బట్టీ ప్రాంతానికి చెందిన పలువురిపై వీధి కుక్క దాడి చేసింది. మధ్యాహ్న సమయంలో కాలనీకి చెందిన ప్రసాద్, నగేష్‌పై కుక్క దాడి చేయడంతో గాయాల పాలయ్యారు. వీరితో పాటు మరో ఇద్దరు కుక్క దాడిలో గాయపడ్డారు. వీరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంచిర్యాలలో కొన్ని రోజులుగా పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

బడి బయట పిల్లలు లేకుండా చూడాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బడి బయట పిల్లలు లేకుండా చూడాలని, దీని కోసం నేటి నుండి జిల్లాలో చేపట్టే బడిబాటను విజయవంతం చేయాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి ఈ నెల 11 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బడి బాటలో స్వయం సహాయక సంఘ సభ్యులను, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులను, ఆయా మండలాల అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. జూన్ నెల 11 వరకు ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు బడిబాట నిర్వహించాలని తర్వాత 13 నుండి 19 వరకు ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు బడిబాట నిర్వహించి పాఠశాల యధావిధిగా కొనసాగించాలన్నారు. బడి బయట పిల్లలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జూన్ మూడో తేదీన స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించినప్పటి నుండి 14న సాముహిక అక్షరాభ్యాసం జరిగే వరకు ప్రతిరోజు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 15, 18, 19 తేదీల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి అనుకున్న లక్ష్యాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ కోఆర్డినేటర్ కటకం మధుకర్, ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ అశోక్

బెజ్జూర్ : ఈ నెల 12న ప్రారంభమయ్యే పాఠశాలలో బయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శుక్ర వారం బడి బాట కార్యక్రమంపై ఆదర్శ మండల సమాఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చదువు పూర్తి చేసిన, బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని తెలిపారు. అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించినందున పిల్లలను బడులలో చేర్పించడానికి మహిళా సంఘాలు కృషి చేయాలని కోరారు. ఈ నెల 3న ప్రారంభమయ్యే బడి బాట ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఐసీడీస్ సూపర్‌వైజర్ నర్మద, సిఆర్‌పి పవన్, ఏపీఎం దుర్గయ్య, ఆదర్శ మండల సమాఖ్య అధ్యక్షులు, సిసిలు పాల్గొన్నారు.



బెజ్జూర్ : మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

చింతలమానేపల్లి : త్వరలో పాఠశాలాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో బడీడు పిల్లలను బడికి పంపించే విధంగా కృషి చేయాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రూపారాణి అధ్యక్షతన బడిబాటపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. జూన్ 3-19 వరకు నిర్వహించతలపెట్టిన బడిబాట కార్యక్రమంలో బడి బయట పిల్లలను బడిలో చేర్పించడానికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

రెబ్బెన : మండల విద్యా వనరుల కేంద్రంలో మండల సమాఖ్య, మండల అధికారులతో మండల విద్యాధికారి యం.వెంకటేశ్వరస్వామి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జూన్ 3 నుండి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు వేముర్ల అమృత, నంబాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.పురుషోత్తం పాల్గొన్నారు.

మహిళా వైద్యురాలిని వేధిస్తే ఊరుకునేది లేదు

- మాదిగ సంఘాల మహాకూటమి



తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న డాక్టర్ నవ్యశ్రీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ప్రయివేట్ వైద్యురాలు నవ్యశ్రీని వేధిస్తే ఊరుకునేది లేదని మాదిగ సంఘాల మహాకూటమి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఛైర్మన్ ఇరిగిరాల భాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ మహిళా వైద్యురాలని కూడా చూడకుండా సంజన ఆసుపత్రి నిర్వాహకుడు జి శ్రీనివాస్ ఆమె ఆసుపత్రికి వచ్చి ఆమెను అసభ్యపదజాలంతో తిట్టడమే కాకుండా దాడి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆమెకు జరిగిన అన్యాయాన్ని తాము ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి ఆమెకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని స్పష్టం చేశారు. బాధితురాలు డాక్టర్ నవ్యశ్రీ మాట్లాడుతూ తాను ఎస్సీ మహిళను కాబట్టే తనపై శ్రీనివాస్ మరియు అతని అనుచరులు దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు. తనకు ఎలాంటి వ్యాధులు లేకున్నా ఉన్నట్లు ప్రచారం చేస్తూ తన కెరీర్‌పై దెబ్బ కొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సంజన ఆసుపత్రి నిర్వాహకుడైన శ్రీనివాస్ నుండి తనకు రూ.30 లక్షల వరకు వేతనాల రూపంలో రావాల్సి ఉన్నందున ఆ ఆసుపత్రి ఫర్నీచర్‌ను తన ఆసుపత్రికి తీసుకువచ్చి వాడుకుంటున్నట్లు తెలిపారు. తన ఆసుపత్రికి ఎలాంటి అనుమతులు లేవని దుష్ప్రచారం చేస్తున్నాడని, అనుమతులు లేకుండా ఆసుపత్రి నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. తనకున్న అనుమతి పత్రాలను ఆమె విలేకరులకు చూపించారు. తనకు శ్రీనివాస్‌తో పాటు అతని అనుచరుల నుండి ప్రాణహాని ఉందని, తనకు పోలీసులు రక్షణ కల్పించాలని ఆమె కోరారు. మాదిగ సంఘాల మహాకూటమి జిల్లా ఛైర్మన్ శ్రీమాన్ మాట్లాడుతూ ఎస్సీ వైద్యురాలిని కులం పేరుతో దూషించిన శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలని, అతను బేషరతుగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్, మాదిగ సంఘాల మహాకూటమి నాయకులు సీహెచ్ సురేష్‌కుమార్, గోగర్ల నరేష్, గోగర్ల కుమార్, సీహెచ్ చక్రవర్తి, నక్క శ్రీనివాస్, ఆయిల్ల శంకర్ పాల్గొన్నారు.

కోత విధించిన వరి ధాన్యం డబ్బులు తిరిగి చెల్లించాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంకె రవి

నవతెలంగాణ-జైపూర్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కోత విదించిన ధాన్యం డబ్బులు రైతులకు తిరిగి చెల్లించాలని మంచిర్యాల జిల్లా రైతు సంఘం అధ్యక్షులు సంకె రవి డిమాండ్ చేశారు. నియోజకవర్గం పరిధిలో గల రైతులతో శుక్రవారం చెన్నూర్ పట్టణంలోని తాపీ మేస్త్రీల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ సాగులో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి వరి పంటలకు సంబంధించి కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోళ్లల్లో రైతులను నిలువుదోపిడి చేస్తున్నారని అన్నారు. క్వింటాలు ఒకంటికి 8 నుండి 10 కిలోల వరి ధాన్యం అదనంగా తూకం వేస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు మిల్లర్లు క్వింటాలు ఒకంటికి రెండు మూడు కిలోల చొప్పున కోత విదిస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు పండించడానికి ఎంత కష్టపడాల్సివస్తుందో అంతకంటే ఎక్కువగా పంటలను అమ్ముకోవడానికి అవస్థలు పడాల్సివస్తోందని అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లారీ యజమానులు, మిల్లు యజమానులు, అధికారులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించాలని, కోత లేకుండా ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు ఇప్పటి వరకు కొనుగోలు చేసిన వరి ధాన్యంకు సంబంధించిన కోత విధించిన ధాన్యం డబ్బులు సంబంధిత రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పంటల సాగులో అతి ప్రధానమైన విత్తనాల్లో నకిలీ విత్తనాలు నిర్మూలించడంతో పాటు నాణ్యమైన విత్తనాలు రైతులకు అందేలా చూడాలని కోరారు. పంట సహాయం కింద రూ.15 వేల చొప్పున పంట కాలానికి ముందే రైతుల బ్యాంకు ఖాతాల్లో వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు.



జూన్ 7న చెన్నూర్‌లో రైతు సదస్సు

ఈ నెల 7న చెన్నూర్ పట్టణంలో రైతు సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గం పరిధిలో గల నాలుగు మండలాల పరిధిలో గల రైతులతో ఏర్పాటు చేయనున్న సదస్సులో రైతు సంఘం పూర్తి స్థాయి కమిటిని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. తాత్కాలికంగా చెన్నూర్ ఏరియా కన్వీనింగ్ కమిటిని ఎన్నుకున్నట్లు తెలిపిన ఆయన కమిటి కన్వీనర్‌గా బోడంకి చందు, కో కన్వీనర్‌గా కుందారపు లచ్చన్న, సిడం కిష్టయ్య, పేదం పద్మ ఆత్రం శ్రావణ్ కుమార్ కమిటిలో ఉన్నట్లు తెలిపారు.

దానాపూర్‌లో పోడు భూముల లొల్లి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మండలం దానాపూర్ గ్రామంలో శుక్రవారం పోడు భూముల లొల్లి కొనసాగింది. గ్రామానికి చెందిన 60 మంది రైతులు కొన్ని సంవత్సరాలుగా 150 ఎకరాల అటవీ భూమిని సాగు చేస్తున్నారు. ఇదే క్రమంలో గత సంవత్సరం అప్పటి జిల్లా అటవీ శాఖ అధికారి శాంతారాం గ్రామానికి వెళ్లి భూములు చూసి వాటిని స్వాధీనం చేసుకుంటామని తెలపడంతో గ్రామస్తులతో చర్చలు జరిపి నాలుగు హెక్టార్ల భూమిని అటవీ అధికారులు తిరిగి తీసుకున్నారు. అప్పుడు జరిగిన ఒప్పందం మేరకు వచ్చే సంవత్సరం మరికొంత భూమి ఇస్తామని గ్రామస్తులు ఒప్పుకున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. ఇదే క్రమంలో శుక్రవారం సదరు భూములను చూడడానికి జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్, ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ, డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, బీట్ అధికారి రవి వెళ్లారు. దీంతో ఊర్లోనే గ్రామస్తులు అడ్డుకున్నారు. గతంలోనే భూములు చూస్తామంటూ వచ్చి పది ఎకరాలు తీసుకున్నారని, ప్రస్తుతం మరోసారి భూములు చూడడానికి ఒప్పుకోమని అడ్డు తగిలారు. అయితే గ్రామస్తుల దగ్గర ఏమైన పత్రాలు ఉన్నాయా అని అటవీ అధికారులు అడగగా తాము బీసీకి చెందిన వారం కావడంతో ఎటువంటి పత్రాలు లేవని, అయినప్పటికీ భూములు వదులుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఒకవేళ అటవీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి భూములు లాక్కోవడానికి ప్రయత్నిస్తే ఉద్యమం చేస్తామంటూ హెచ్చరించారు. ఇదే సందర్భంలో గ్రామస్తులు రోడ్డుకు అడ్డుగా నిలబడి అటవీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లాలో గిరిజనులకు పోడు భూముల పట్టాలు ఇచ్చినప్పటికీ బీసీల పోడు లొల్లి యధావిధిగా కొనసాగుతోంది.

పూలే దంపతుల జీవితం ఆదర్శనీయం



నవతెలంగాణ-వాంకిడి

జ్యోతిబాపూలే ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే జీవితాలు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. మండలంలోని బోర్ద గ్రామంలో ఏర్పాటు చేసిన పూలే దంపతుల విగ్రహాలను నియోజకవర్గ ఇన్చార్జి శ్యాంనాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, చెడు ప్రభావాలను తొలగించడంలో పూలే దంపతులు ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రస్తుత సమాజానికి వీరు ఆదర్శప్రాయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు జక్కన్న, మాలి సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్ పటేల్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుర్నులే నారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతీ పటేల్, నాయకుడు విశ్వనాధ్ పాల్గొన్నారు.

సంచలనం సృష్టించిన కేసును ఛేదించిన పోలీసులు

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్‌లో సంచలనం సష్టించిన భారీ దొంగతనం కేసును 3 రోజుల్లోనే మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ సాంకేతిక పరిజ్ఞానంతో చెదించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లో చదువుకునే యువతి సమ్మర్ హాలిడేస్‌లో భాగంగా నస్పూర్, నాగార్జున కాలనీలోని తాత వాళ్ళ ఇంటికి వచ్చింది. యువతికి గత సంవత్సరం ఆన్‌లైన్ ద్వారా పరిచయం ఐన హైదరాబాద్‌కి చెందిన యువకుడితో స్నేహం ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తాత ఇంట్లో బంగారం, నగదుని చూసి యువతి, యువకుడికి చెప్పగా ముందే పథకం ప్రకారం యువకుడు హైదరాబాద్ నుంచి వచ్చి దొంగతనానికి పాల్పడ్డారు. తాత సింగరేణి ఉద్యోగానికి, అమ్మమ్మ సాయంత్రం వాకింగ్‌కి వెళ్లగా ఇంట్లో యువతి ఒక్కతే ఉండి యువకుడికి ఫోన్ చేసి చెప్పగా యువకుడు ఇంటి వెనకాల గోడ దూకి రాగా ఇద్దరు కలిసి ఇంట్లో బీరువా పగులగొట్టి రూ.4.5 లక్షల నగదు, సుమారు 15 తులాల బంగారం, 30 తులాల వెండి దొంగలించి గోడ దూకి వెళ్లిపోగా, యువతి ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లి అమ్మమ్మ వాకింగ్ నుండి వచ్చాక అమ్మమ్మతో కలిసి ఏమి తెలియనట్లు ఇంట్లోకి వచ్చింది. అమ్మమ్మ బెడ్ రూమ్‌లోకి వెళ్లగా బీరువా పగులగొట్టి అందులో నగదు, బంగారు, వెండి ఆభరణాలు కనపడపోయేసరికి ఎవరో గుర్తు తెలియని దొంగలు దొంగిలించారని చుట్టుపక్కలవాళ్ళకి సమాచారం అందించి పోలీసులకు పిర్యాదు చేసారు. సీఐ అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఫింగర్ ప్రింట్, జాగిలాలు, సీసీ కెమెరాలు, మొబైల్ ఫోన్ డేటా విశ్లేషణ, అన్ని కోణంలో దర్యాప్తు చేసి సాంకేతిక ఆదారాలతో దొంగతనం చేసిన నిందితులని పట్టుకున్నారు. వారి నుంచి రూ.4.25 లక్షల నగదు, 15 తులాల బంగారం, 30 తులాల వెండి, ఒక పల్సర్ ద్విచక్ర వాహనం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని యువతి, యువకుడిని రిమాండ్‌కి పంపడం జరిగిందన్నారు. కేసుని త్వరగా చేదించిన సీఐ అశోక్, ఏస్ఐలు రవికుమార్, జితేందర్, క్రైమ్ టీం ఇజాజ్, నరేందర్, సీసీఎస్ టీం సతీష్, శ్రీనివాస్‌లను సీపీ, డీసీపీ అభినందించారు.

ముగిసిన బాక్సింగ్ శిక్షణ శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ మరియు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన బాక్సింగ్ వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. మే ఒకటో తేదీ నుండి ఈ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న విషయం తెల్సిందే. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు వేముర్ల మధు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న విద్యార్థులకు ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. 50 మంది విద్యార్థులకు నిర్వహించిన ఈ ఉచిత శిక్షణ శిబిరంలో ఎక్స్ ఆర్మీ అసోషియేషన్ అధ్యక్షులు శివ బాక్సింగ్ సామాగ్రి, పండ్ల రసాలు, స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు సాయి, వంశీ, నివాస్, వినయ్, శివ, అసోషియేషన్ కార్యదర్శి మధురై, శేఖర్ మాస్టర్, కోశాధికారి రమాకాంత్ యాదవ్, ఉపాధ్యక్షులు కంబాల జయేందర్, సంయుక్త కార్యదర్శి బలరాం, ఎండి జుబేఉద్దీన్, నాయకులు లలిత్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

● మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు



నవతెలంగాణ-మంచిర్యాల

బీఆర్ఎస్ హాయంలోనే జిల్లా అభివద్ధి చెందిందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం మంచిర్యాలలో 450 పడకలతో నిర్మాణం అవుతున్న ప్రభుత్వ ఆస్పత్రి పనులను ఆయన పరిశీలించారు. మంచిర్యాలను అభివృద్ధి లో భాగంగా రూ.500 కోట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వం మంచిర్యాలకు మెడికల్ కలశాలను మంజూరు చేసిందని తెలిపారు. నిర్మాణ పనులు వేగవంతం చేసి నాణ్యతతో కూడిన పనులు చేయాలని అధికారులను కోరారు. మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు తాజ్, అంకం నరేష్, సుంకరి రమేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదిన వేడుకలను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ సర్పంచ్ ఆడె బాదు, ఉప సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు బోయిని తిరుపతి యాదవ్, రాంటెంకి వాల్దేవ్, లంక లక్ష్మణ్, అక్కెపల్లి బుగ్గ రాజు, మల్లేశ్, పెంద్రం హన్మంతు, కరీం పాల్గొన్నారు. దేవాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడి, బీఆర్ఎస్ నాయకులు మచ్చ అశోక్, కైలాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ధర్మారావుపేటలో బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మంజుల సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అజ్మీర తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు బాసవేణి కొమురయ్య, శ్యాం సుందం పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



లక్షెట్టిపేటలో..

నవతెలంగాణ-లక్షెట్టిపేట

బడిబాట కార్యక్రమంపై మండల ప్రత్యేక అధికారి సురేఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జూన్ 1 నుంచి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్రామ స్థాయి కమిటీని ఏర్పాటు చేసి బడిబాట కార్యక్రమంపై కార్యచరణ రూపొందిచాలని సూచించారు. జూన్ 3న గ్రామాల్లో సమావేశం ఏర్పాటు చేసి పాఠశాలల్లో చేర్పించడానికి ప్రతిజ్ఞన చేయించాలన్నారు. అదేవిదంగా ఇంటింటికి తిరుగుతూ బడీడు పిల్లల పేర్లు నమోదు చేయాలని, 5 నుంచి 10వ తేది వరకు ఇంటింటికి తిరుగుతూ పిల్లలను బడిలో చేర్పించాలని అన్నారు. 11, గ్రామ సభలు, 12న పాఠశాలలను అలంకరించి రంగోలీ లాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇలా 19వ తేది వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి విజయ్ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం లక్ష్మి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జన్నారం : జూన్ మూడవ తేదీ నుంచి 19వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో బడి బావట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ శశికళ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో పక్షలం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి, ఎంఈఓ విజయ్ కుమార్, ఏపీఎం రవీందర్, ఎంపీఓ రమేష్, ఏఎస్ఐ బిక్కు నాయక్, అంగన్‌వాడీ సూపర్వైజర్లు, ఐకేపీ సీసీలు వివిధ గ్రామాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



జన్నారంలో..

తాండూర్ : ఈ నెల 3 నుండి 19వ తేదీ వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమంలో అధికారులంతా భాగస్వాములు కావాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం తాండూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కుమారస్వామి నోడల్ అధికారి మల్లేశంతో కలిసి మండల స్థాయి అధికారులతో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చదివేటట్లు ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే ఉచిత విద్య, దుస్తులు, పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు,



తాండూర్‌లో..

మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు తెలుపాలన్నారు. బడీడు పలిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే విదంగా విద్యార్థుల తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏటీఎం పోమ నాయక్ సూపర్‌వైజర్ మమత పాల్గొన్నారు.

జైపూర్ : మండలంలోని బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీఆర్‌డీఓ కిషన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రయివేటు పాఠశాలలు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాలని కోరారు. ఈ నెల 3 నుండి 19 వరకు నిర్వహించ తలపెట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మండల స్థాయి అధికారులు, కమీటి సభ్యులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక తహసీల్దార్ వనజా రెడ్డితో పాటు మండల స్థాయిలో గల వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

భీమారం మండల పరిషత్‌లో...



జైపూర్‌లో..

భీమారం మండల పరిధిలో గుర్తించిన అమ్మఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు పూర్తికావస్తుండగా పనుల నిర్వాహణను నిరంతరం పర్యవేక్షించాలని స్థానిక ఎంపీడీఓ రాధారాథోడ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశమైన ఆమె మండల పరిధిలో బడిబాట కార్యక్రమం ద్వార బడిఈడు గల పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అమ్మఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక సదుపాయాలు, మరమ్మత్తు పనులు దాదాపుగా పూర్తి కావచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సదానందం, నోడల్ అధికారి సురేష్ పాల్గొన్నారు.

కాసిపేట : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా జూన్ 3వ తేది నుంచి 19వ తేది వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెళ్లడించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయటంలో అధికారులు, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, ఏపీఎం వెంకటేశ్వర్లున, సమాఖ్య అధికారుల్లు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



కాసిపేటలో..

విద్యార్థులు వృత్తి విద్యలోనూ రాణించాలి

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులకు చదువుతోపాటు వృత్తి విద్యపై అవగాహన పెంచాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్ డీఈఓ యాదయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మండలంలోని కలమడుగు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఎన్ఎంఎంఎస్‌లో జిల్లాలో మొదటి స్థానంలో నిలువగా వారిని షాలువా, పూలమాలతో సత్కరించారు. అలాగే అదే పాఠశాలల్లో పదవ తరగతిలో 9.8 జీపీఎస్ సాధించిన విద్యార్థిని అభినందించారు. పాఠశాలలో పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచిన సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి ఇతర ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు. భవిష్యత్తులోమంచి స్థాయిలలో నిలవడానికి ఇప్పటినుంచే మార్గం వేసుకోవాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడి కృషి వల్లనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. చదువుతోపాటు వత్తి విద్యా కోర్సుల్లో చేరే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయ్ కుమార్, కవితా, ముత్య తిరుపతి, ఎం తిరుపతి నరసయ్య, సాగర్, తోట శ్రీనివాస్, లక్ష్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

● జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-జైపూర్

భారత ప్రభుత్వం అమలులోకి తెస్తున్న నూతన చట్టాలపై పోలీస్ అధికారులు అవగాహణ కలిగివుండాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు సూచించారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ జైపూర్ సబ్ డివిజన్ పరిధిలో గల పోలీస్ అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆయన వచ్చే నెల నుండి అమలు చేయనున్న చట్టాల పట్ల అవగాహణ కల్పించారు. కొత్తగా అమలులోకి వస్తున్న భారతీయ న్యాయ సమ్హిత, భారతీయ నాగరిక్ సురక్ష సమ్హిత, భారతీయ సాక్షం, అధి నియమ్ తదితర చట్టాల అమలుపై అవగాహణ కల్పించారు. జైపూర్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ వెంకటేశ్వర్లుతో పాటు చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, శ్రీరాంపూర్ సీఐ మోహన్, జైపూర్ ఎస్సై నాగరాజు, హెడ్‌క్వాటర్ నుంచి వచ్చిన ఎస్సై సంతోష్, వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల హెడ్‌కానిస్టేబుళు పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను అమ్మాలి



నవతెలంగాణ-తాండూర్

దుకాణదారులు ప్రభుత్వ అనుమతి పొందిన నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని వ్యవసాయ అధికారి కిరణ్మయి తెలిపారు. శుక్రవారం మండలంలోని విత్తన దుకాణాలను సీఐ కుమారస్వామితో కలిసి సీడ్స్, ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీడ్స్ ఫెర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మాలని సూచించారు. విత్తనాల అమ్మకానికి సంబంధించిన రసీదులను రైతులకు అందజేయాలని తెలిపారు. స్టాకు రిజిస్టర్‌లను, బిల్ పుస్తకాలను, రైతు రిజిస్టరను తీనిఖీ చేశారు. నకిలీ విడి విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తనాల తయారు తేదీ గడుపుతేది మొలక శాతాన్ని సరిచూసుకోవాలన్నారు. ఏవో వెంట ఏఈఓ శంకర్ ఉన్నారు.

లక్షెట్టిపేట : పట్టణంలోని విత్తనాల దుకాణాలను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి ఈ సురేఖ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, రైతు వారి విత్తన డిస్ట్రిబ్యూషన్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రైతులకు తప్పని సరిగా బిల్స్ ఇవ్వాలని, విత్తనాలు ఎమ్మార్పీకి మించి అమ్మరాదని, అన్ని రిజిస్టర్‌లు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల తనిఖీ

నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని నీల్వాయి, క్యాతనపల్లి గ్రామ పంచాయితీలను శుక్రవారం జిల్లా పంచాయితీ అధికారి వెంకటేశ్వర్ రావు తనిఖీ చేశారు. గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్‌లను సందర్శించి కంపోస్ట్ పిట్‌లో కంపోస్ట్ ఎరువును తయారి విధానాన్ని పరిశీలించి, కంపోస్ట్ పిట్‌లో వానపాములు బ్రతికి ఉండేలా చూడాలని కంపోస్ట్ ఎరువు తయారు ప్రక్రియను నిరంతరం కొనసాగించడంతో పాటు తయారు చేసిన కంపోస్ట్ ఎరువును నర్సరీలకు పల్లెప్రకృతి వనంలోని మొక్కలకు వినియోగించాలని, కంపోస్ట్ ఎరువును విక్రయించి వచ్చిన ఆదాయాన్ని జీపీ జనరల్ ఫండ్ డిపాజిట్ చేయాలన్నారు. అలాగే గ్రామలలోని పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి, రోడ్లపై ప్లాస్టిక్ లేకుండా శుభ్రం చేయించాలని, గ్రామలలో ఎక్కడా ప్లాస్టిక్ కనబడకుండా చూసుకోవాలని, ప్రతీ రోజు రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీపతి బాబురావు, పంచాయతీ కార్యదర్శులు అశోక్, జాఫర్ అలీ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ముస్లిం భాయ్ భాయ్

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ మండలం ఇందారం గ్రామంలో హనుమాన్ భక్తులకు బిక్ష ఏర్పాటు చేసినస్థానిక ముస్లీం నాయకుడు మహ్మద్ ఫయాజోద్దీన్ హిందు ముస్లీం భాయ్ భాయ్ అన్నారు. గ్రామ పంచాయతీ పరిధితో పాటు పరిసర గ్రామాలకు చెందిన హనుమాన్ భక్తులకు స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం బిక్ష ఏర్పాటు చేసిన ఆయన స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ఇందారం గ్రామస్థులతో ఇక్కడి ముస్లీం కుటుంబాల వారు సోదరభావంతో కలిసి మెలిసి ఉంటారని పేర్కొన్నారు. హిందువుల పండుగలైనా, ముస్లీంల పండుగలైనా కుల మతానికి అతీతంగా జరుపుకోవడం ఇక్కడ సాంప్రదాయంగా కొనసాగుతుండటం సంతోషమని అన్నారు. హిందువులు జరుపుకునే పండుగల్లో ముస్లీం కుటుంబాలు, హిందు కుటుంబాల వారు సైతం రంజాన్ పండుగ వేడుకల్లో పాల్గొనడం ఆనవాయితిగా కొనసాగుతుందని, భవిష్యత్తులో కూడా ఇదే తీరుగా హిందు ముస్లీం కుటుంబాల వారు కలిసి మెలిసి ఉండాలని ఈ సంధర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిప్పకుర్తి దుర్గయ్య, మాజీ ఎంపీటీసీ సుంకరి శ్రీనివాస్, జైపూర్ మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మన్, తోకల శ్రీనివాస్, గుడికందుల లక్ష్మినారాయణ, సాగర్, గౌసి, గయాజ్ హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

మురుగుదొడ్లు, బస్‌షెల్టర్ కోసం సంతకాల సేకరణ



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద పర్మినెంట్ బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని, అలాగే పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మిడివెల్లి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీసీ కార్నర్ నుంచి రోజుకు వందలాదిమంది పనులకు, స్కూల్, కాలేజీ, ఊరికి ప్రయాణిస్తుంటారని, అలాంటి వారికి కనీస సౌకర్యాలు కూడా కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. నిత్యం రద్దీగా ఉన్నటువంటి ప్రదేశంలో మహిళలు, విద్యార్థినిలకు టాయిలెట్స్ సౌకర్యం కూడా లేదని మండిపడ్డారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు ముందుకు వచ్చి ఈ పనిని త్వరగా చేపించాలని సీపీఐ(ఎం) పార్టీ ప్రజాసంఘాలు డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరిగేల మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అభినవ్, అరవింద్ పాల్గొన్నారు.

రైతు బతుకులు ఆగం చేస్తున్న నేషనల్ హైవే 63

నవతెలంగాణ-మంచిర్యాల

నేషనల్ హైవే 63 రహదారితో రైతుల బ్రతుకులు ఆగమవుతున్నాయని, ఒక పద్ధతి ప్రకారంగా అధికారులు రోడ్డు సర్వే చేయడం లేదని రిటైర్డ్ సూపరిండెంట్ ఇంజనీర్ నారపురెడ్డి ఆరోపించారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలో గల చార్వక హాల్ లో నేషనల్ హైవే 63 రహదారి భూ నిర్వాసితులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్షెట్టిపేట్ నుండి మంచిర్యాల వరకు పాత రోడ్డునే అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి రూ.వందల కోట్లు ఆదా అయ్యేవని, ప్రస్తుతం 40 మీటర్లు ఉన్నా రోడ్డుకి ఇరువైపులా రెండున్నర మీటర్ల చొప్పున ఐదు మీటర్లు తీసుకున్నట్లయితే ఏ విధమైన భూసేకరణ లేకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు నిర్మాణం అయ్యేదని తెలిపారు. తద్వారా మొత్తం రోడ్డు వ్యయం రూ.4800 కోట్లు అయితే అది కేవలం 1200 కోట్లతోనే పూర్తిచేసే అవకాశం ఉందని అన్నారు. దాదాపుగా అధికారుల తప్పిదాల వల్ల రూ.3500 కోట్లు ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. రైతులు సాగు చేసుకునే వ్యవసాయ భూములని నాశనం చేయొద్దని కోరారు. గతంలో ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు నిర్వాసితులుగా ఉన్న లక్షెట్టిపేట, హాజీపూర్ రైతులకు ఇప్పటికి న్యాయం జరగలేదని, మరోసారి నేషనల్ హై వే పేరుతో రైతులను భూ నిర్వాసితులుగా మార్చడం చట్ట వ్యతిరేకం అన్నారు. మూడుసార్లు అలైన్మెంట్ మార్చి రైతులకు ద్రోహం చేస్తూ ప్రభుత్వాన్ని మోసం చేసి, దాదాపు రూ.3500 కోట్లు ప్రభుత్వ ఖజానాపై భారం పడే విధంగా జరిగిన ఈ సర్వేపై సీబీఐ, విజిలెన్స్ విచారణ జరిపిపించాలని డిమాండ్ చేశారు. ఎన్ హెచ్ 63 రహదారి నిర్మాణం విషయంలో అధికారులు ఎక్కడ కూడా ప్రమాణాలు పాటించలేదని వాస్తవాలను దాచిపెట్టి అధికార దుర్వినియోనికి పాల్పడ్డారని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో రైతులు మరోసారి భూ నిర్వాసితులుగా మారే ప్రమాదం ఉందని అన్నారు. సర్వస్వం కోల్పోయి దిక్కు లేని వారిగా మారే ప్రమాదం ఉన్నదని అన్నారు. రైతులకు ఏమి జరిగినా కూడా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు తుల మధుసూదన్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్ఆర్ బోస్, రైతు సంఘ నాయకులు వడ్నాల శ్యామ్, రాజమౌళి, తిరుపతి, జనార్దన్‌రెడ్డి, బానోతు దాస్య పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య



నవతెలంగాణ-మంచిర్యాల

నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వేసవి సెలవుల్లోనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యఓఉడు కె జంగయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కార్యదర్శి గుర్రాల రాజవేణప్ప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యతి మాట్లాడుతూ గత అక్టోబర్‌లో అర్ధాంతరంగా నిలిపివేసిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే పునఃప్రారంభించాలని, గిరిజన సంక్షేమ పాఠశాలలు, గురుకులాల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను కూడా వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్ళుగా పదోన్నతులు, ఆరేళ్ళుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులకు తీరని నష్టం జరుగుతున్నదని, సకాలంలో స్పందించి సమస్యలను పరిష్కారం చేయటంలో విద్యాశాఖ కమీషనర్ శ్రీదేవసేన నిర్లక్ష్యం కారణంగానే పదోన్నతుల్లో ప్రతిష్ఠంభన ఏర్పడిందని, ఇటీవల ఎన్సీటిఈ ఇచ్చిన వివరణ, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం పదోన్నతులకు ప్రధానోపాధ్యాయులు, పాఠశాల స్థాయి మారని సందర్భంలో 23.08.2010కి పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు టెట్‌తో నిమిత్తం లేకుండా పదోన్నతులు ఇవ్వాలని స్పష్టం చేసినందుకు ఉపాధ్యాయుల్లో టెట్ టెన్షన్ నుండి ఉపశమనం లభించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు యూఎస్‌పీసీ, జాక్టో ప్రతినిధులతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం చర్చలు జరిపారని, ఆ సందర్భంగా ఎన్నికల సంఘం అనుమతితో పదోన్నతులు, బదిలీలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని అన్నారు. విద్యాశాఖ వైఫల్యాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి రోజురోజుకి దిగజారుతోందన్నారు. టెట్ విషయంలో ఎన్సీటిఈ ఏప్రిల్ 8న ఇచ్చిన వివరణను కమీషనర్ వెల్లడించకుండా ఉపాధ్యాయులతో టెట్‌కు దరఖాస్తు చేయించడం ద్వారా రూ.లక్షలు వృధా చేయించారని, ఉపాధ్యాయులను మానసిక ఆందోళనకు గురిచేశారని రాష్ట్ర కార్యదర్శి ఏ. వెంకట్ ఆరోపించారు. విద్యాశాఖలో సంక్షోభానికి కారణమైన కమీషనర్ దేవసేనను ఆ బాధ్యతలనుండి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు, రాష్ట్ర కమిటీ సభ్యులు రామన్న, శ్రీనివాస్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు ఏ.స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు జి నర్సయ్య, జిల్లా కార్యదర్శులు వి కిరణ్ కుమార్, ఏ సంతోష్, అయూబ్ ఖాన్, జిల్లా కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు కిష్టన్న, తిరుపతి, చక్రవర్తి, అశోక్, జైపాల్, గురువయ్య, దిలీప్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పెట్రోల్ బంక్





రేకుల షెడ్డులో మూత్రశాల

నవతెలంగాణ-దండేపల్లి

వినియోగదారులకు అన్ని రకాల వసతులను కల్పించి సేవలు అందించాలని నిబంధనలు ఉన్నప్పటికీ మెదరిపేట్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఓ పెట్రోల్ బంకు నిర్వాహణ నిబందనలకు విరుద్ధంగా సాగుతోంది. కనీస వసతులు కల్పించకుండా పెట్రోల్, డీజిల్ కొనుగోలుకు వస్తున్న వినియోగదారులకు కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని మెదరిట్ గ్రామ శివారులో ఇండియన్ ఆయిల్‌కు చెందిన ఓ పెట్రోల్ బంకును నిర్వహిస్తున్నారు. సదరు యజమాని ఈ పెట్రోల్ బంకును వేరే వ్యక్తులకు అద్దెకు ఇవ్వడంతో వారు నిర్వహణ మరిచారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాల్సిన వసతులు లేవని వినియోగదారులు విమర్శిస్తున్నారు. పెట్రోల్ బంకులో ఫైర్ బకెట్, సిలిండర్స్, తాగునీటి సదుపాయం, టాయిలెట్స్ గదులు, ఎయిర్ మిషన్స్ ఉండాలి. బంకు నిర్వాహకులు మాత్రం కనీస వసతులను మరిచారని పలువురు వినియోగదారులు విమర్శిస్తున్నారు. వేసవిలో వేడిమి, ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ వేసే పంపు సెట్ల దగ్గర కూడా షెడ్ ఏర్పాటు చేయడం మరిచారు. కనీసం తాగు నీటి వసతిని కూడా విస్మరించారు. కనీస సౌకర్యాలు లేకుండా అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకుని కనీస వసతులను కల్పించాలని స్థానికులు, పెట్రోల్, డీజిల్ వినియోగదారులు కోరుతున్నారు.

ప్రయివేట్ ఆస్పత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని శివప్రియ నర్సింగ్ హోమ్ ఆస్పత్రిని శుక్రవారం డీఎంహెచ్ఓ డా.నరేందర్ రాథోడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులకు సాధారణ ప్రసవాలు, లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై పలు సూచనలు చేశారు. వీటికి సంబంధించిన ఆస్పత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. రిజిస్టర్ నిర్వహణ అసంపూర్తిగా ఉన్న అంశాలపై నోటీసు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అదే విధంగా జిల్లాలోని అన్ని ఆస్పత్రుల వారు రిజిస్టర్లు పేషెంట్ ఫైల్స్ కచ్చితంగా నియమానుసారంగా నిర్వహించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్ బిల్లుల చెల్లింపుతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధా డిమాండ్ చేశారు. శుక్రవారం ఐసీడీఎస్ డీడబ్ల్యూఓ సబితాను కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాధ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ అద్దెలు చెల్లించాలన్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు సునంద, సభ్యులు కవిత, అనిత, మీనాక్షి, సుజాత, సురేఖ పాల్గొన్నారు.



అడ్డదారి తొక్కుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాకతీయ యూనివర్సిటీ పరీక్ష విభాగంలో విద్యార్థులను పాస్ చేసేందుకు అడ్డదారి తొక్కుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని టీజీవీపీ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ కొట్టూరి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఒక్కో పేపర్‌కు రూ.5 వేలు తీసుకొని ఆన్సర్ బుక్‌లెట్ బయటకు పంపి గుట్టుచప్పుడు కాకుండా జవాబులు రాసి తిరిగి జవాబు పత్రాల బండిల్స్‌లో అనుమానం రాకుండా పెట్టేస్తున్నారని ఆరోపించారు. గత పదేండ్ల కింద ఇలాంటి సంఘటన జరిగిందని, దీంతో పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీనికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. అంతేకాకుండా పరీక్ష కేంద్రాల వద్ద సీసీ, ఎగ్జామినేషన్ బ్రాంచీల వద్ద కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

యూనిఫాం పంపిణీలో ఆలస్యం చేయొద్దు

నవతెలంగాణ-నార్నూర్

స్కూల్ యూనిఫాం పంపిణీలో మహిళ శక్తి టైలర్స్‌లు ఆలస్యం చేయొద్దని పాఠశాలల పున: ప్రారంభం కంటే ముందే పాఠశాలలో పంపిణీ చేయాలనీ ఏపీఎం మైస రమేష్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంతో ఐకేపీ కార్యాలయంలో మహిళ శక్తి టైలర్స్‌లకు కుట్టడానికి పాఠశాల వారీగా యూనిఫాం దుస్తులను అందించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్స్, కేజీబీవీ, మోడల్ స్కూల్‌తో సహా మొత్తం 74 పాఠశాలలో 1350 బాలికలు, 1506 బాలురు కలిపి మొత్తం 2,856 మంది ఉన్నారని వారికి సకాలంలో యూనిఫాం అందిచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీలు కాంబ్లే సంతోష్, రాథోడ్ సంతోష్, రేవయ్య, శ్రీరామ్, కిషన్, వీఓఏలు, మహిళా శక్తి టైలర్స్‌లు ఆడే జయశ్రీ, రాథోడ్ శ్యామక, వర్ష రాథోడ్ శిరీష ఉన్నారు.

త్రివేణి సంగమం సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా..

- డీఆర్డీఓ సాయన్న



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని త్రివేణి సంగమం చెరువు సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని డీఆర్డీఓ, మండల ప్రత్యేకాధికారి సాయన్న అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని త్రివేణి సంగమం చెరువును సందర్శించారు. వర్షాకాలంలో వరద బీభత్సం వల్ల చెరువు నిండు కుండలా నిండి అలుగు నుంచి నీటి ప్రవాహం ఎక్కువై ప్రధాన బీటీ అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. దానిలో భాగంగా చెరువు అలుగును పరిశీలించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో నీటి ప్రవాహం అధికమైనప్పుడు ప్రధాన బీటీ రోడ్డుకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త పై పూర్తి నివేదికను కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఈజీఎస్ ఏపీఓ జాదవ్ శ్రీనివాస్, టీఏ విఠల్, చవాన్ ప్రకాష్ ఉన్నారు.

ఎడారి జీవులు... వలస బతుకులు..



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఎడారి జీవులైనా రాజస్థానీలు ప్రతి సంవత్సరం మే, జూన్ నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో అడవుల జిల్లాగా పేరుపొందిన ఆదిలాబాద్‌కు వలస వస్తారు. వారి ముఖ్య జీవనాధారం గొర్రెల, ఒంటెలను పెంచుతూ తమ జీవనాన్ని సాగిస్తారు. ఆదిలాబాద్ జిల్లా పెన్ గంగానది పరివాహక ప్రాంతంలో ఉన్నందున నదిపరివాహక ప్రాంతాల్లో గొర్రెలు మేపుతూ తమ జీవనాన్ని సాగిస్తారు. శుక్రవారం వారు మండల నుంచి వెళుతుండగా కనిపించిన దృశ్యమిది.

బడిబాటలో అందరూ భాగస్వాములు కావాలి

- ప్రత్యేక అధికారికి సురేష్

నవతెలంగాణ-సారంగాపూర్

బడి ఈడు పిల్లలను గుర్తించి, సమీప పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, మండల ప్రత్యేక అధికారి సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బడిబాట కార్యక్రమం జూన్ 3 నుంచి 19వ తేది వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, తల్లిదండ్రులు ఇంటింటా ప్రచారం ర్యాలీలతో విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మధుసూదన్, ఎంపీడీఓ తిరుపతిరెడ్డి, మండల నోడల్ అధికారి జనార్ధన్, డీటీ రవీందర్, పీఆర్ఎఈ శరత్, ఎఎస్సై వసంత్, కాంప్లెక్స్ ప్రాధానోపాధ్యాయులు సాయన్న, విజయ, ఏపీఎం మాధురి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అందుబాటులో పత్తి విత్తనాలు

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- రైతులెవరూ ఆందోళన చెందొద్దు
- విత్తన దుకాణాలు, గోదాముల తనిఖీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన పత్తి విత్తనాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడం జరుగుతుందని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు విత్తన దుకాణాలను, గోదాములను పరిశీలించారు. జిల్లాలో ఒకే రకం విత్తనం కోసం గత నాలుగైదు రోజులుగా నెలకొంటున్న గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం విత్తన పంపిణీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. సదరు డీలర్‌కు వచ్చిన స్టాక్, దుకాణాలకు పంపిణీ చేసిన విత్తన బ్యాగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అక్కడి రిజిష్టర్లను తనిఖీచేసి గోదాంలో నిల్వ ఉంచిన స్టాక్‌ను పరిశీలించారు. ఇక నుంచి ప్రతి గోదాము వద్ద విత్తన పంపిణీని పర్యవేక్షించేందుకు రెవెన్యూ, పోలీసు శాఖల ఉద్యోగులను నియమించనున్నట్టు పేర్కొన్నారు. అందుబాటులో 125 రకాల విత్తనాలు ఉన్నాయని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాల కొరత లేకుండా అన్ని రకాల పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. 55 కంపెనీలకు సంబంధించిన 125 రకాల విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇవన్నీ ప్రభుత్వంచే గుర్తించబడినవని అన్నారు. జర్మినేషన్, ఇతర పరీక్షలన్నీ నిర్వహించబడి మార్కెట్లోకి విడుదల చేయబడ్డాయని తెలియజేశారు. రైతులు ఒకే రకం పత్తి విత్తనం కోసం డిమాండ్ చేయడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. గత యేడాది లక్ష 20 వేల ప్యాకెట్ల రాశి విత్తన బ్యాగులు జిల్లాకు కేటాయిస్తే ఈ సారి లక్షా 50 వేల ప్యాకెట్లను తెప్పించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 60 వేలు వచ్చాయని, ఒకటి రెండు రోజుల్లో మిగితావి అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రైతులు విత్తుకునే సమయానికి ముందే పూర్తి స్థాయిలో విత్తనాలు అదుబాటులో ఉంటాయని. కంగారు పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీఓ వినోద్ కుమార్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

పొగాకు తాగడం మృత్యువును ఆహ్వానించినట్లే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలు తెలిసీకూడా పొగాకు ఉత్పత్తులను వినియోగించడమంటే కోరి మృత్యువును ఆహ్వానించినట్లేనని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో పొగాకు వల్ల కలిగే అనార్థాలను వివరిస్తూ, ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం పొగాకు తాగడానికి దూరంగా ఉండటంతో పాటు ఆరోగ్య భారతానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ పొగాకు వినియోగం అనేక వ్యాధులకు కారణమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గుట్కా, ఖైని లాంటి పదార్థాలను నిషేదించడంతో పాటు 2003లో కోట్ప చట్టాన్ని తీసుకువచ్చిందని తెలియజేశారు. పొగాకు వల్ల యువత జీవితాలను నాశనం చేసుకుంటోందని, తొలుత సరదాకోసం పొగాకు తాగుతూ తరువాత అలవాటుగా మార్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.



దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించేలా జిల్లాలోని 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. బహిరంగ ప్రదేశాల్లో బీడీలు, సిగరెట్లు తాగేవారికి జరిమనాలను విధిస్తూ సూచనలు చేయాలన్నారు. పొగాకు రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వాములై ఆరోగ్య జిల్లా నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్ఏ డాక్టర్ సాధన. వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్యులు శ్రీధర్, సమియొద్దిన్, గజానంద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైతు అవగాహన కార్యక్రమాలు



నవతెలంగాణ-జైనథ్

రైతులు పత్తి విత్తనాలు కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై జిల్లా వ్యాప్తంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే శుక్రవారం మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో రైతులకు విత్తన ఎంపిక సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఓ వివేక్ తెలియజేవారు. ఈ సందర్భంగా ఏఓ వివేక్ మాట్లాడుతూ రైతులు విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా బయట వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయరాదని తెలిపారు. బయట వ్యక్తులు ఎవరైనా విత్తనాలు అమ్మినచో అలాంటి వారి సమాచారం వ్యవసాయ, పోలీస్ అధికారులకు అందించాలని తెలిపారు. మండల రైతులు ఒకే రకం విత్తనాలపై ఆధారపడకూడదని అన్నారు. పలు రకాల విత్తనాలు వాడిన సమాన దిగుబడి వస్తుందని తెలిపారు. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు సమయంలో రశీదు తప్పని సరిగా పొందాలని, విత్తన ప్యాకెట్ పైన ఉన్న వివరాలు చూసి కొనుగోలు చేసుకోవాలని సూచించారు. సూపర్‌కార్డ్ రకం పత్తి వేసి అధిక దిగుబడిన సాధించిన పిప్పర్‌వాడ రైతుని ఏఓ వివేక్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నోముల సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలు ప్రారంభంలోగా దుస్తులు అందజేయాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

పాఠశాలలు ప్రారంభంలోగా దుస్తులు అందజేయాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్ నాగమణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని జిల్లా స్పెషల్ ఆఫీసర్ నాగమణి పరిశీలించారు. యూనిఫామ్స్ కుట్టడంలో జాప్యం చేయవద్దని సూచించారు. జూన్ 12న ప్రభుత్వ పాఠశాలలు పున్హ ప్రారంభం వరకు విద్యార్థులకు ఒక జత యూనిఫామ్ సిద్ధం చేసి ఇవ్వాలని కోరారు.

నేడు బడిబాట కార్యక్రమ సమావేశం

నవతెలంగాణ-ఇచ్చోడ

బడిబాట కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు ఏంఈఓ ఉదయ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశనికి తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, ఏఈపీఆర్, ఆయా మండల అధికారులతో పాటు ఏహెచ్ఎస్, టీడబ్ల్యూపీఎస్, జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, వీఓఏలు తప్పని సరిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత

నవతెలంగాణ-ఉట్నూర్

ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వేణునగర్ కాలనిలోని హనుమాన్ ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో చల్లంగా ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు జడ్పీ పాఠశాలలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగిసింది. చిన్నారుల్లో క్రీడలపై ఆసక్తిని పెంచేందుకు మే 1 నుంచి 31 వరకు శిక్షణ శిబిరం నిర్వహించారు. శుక్రవారం ఆ పాఠశాల ఆవరణలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 30 మంది విద్యార్థులు వాలీబాల్ క్రీడల్లో మెలకువలు నేర్చుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి తెలిపారు.

రెండు బైకులు ఢీ : ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-జన్నారం

రెండు బైక్లు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన జన్నారంలోని ఇందన్‌పల్లిలో చేటుచేసుకుంది. శుక్రవారం ఇందన్‌పల్లి ప్రధాన రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో సాయన్న, పగ్గు తీవ్రంగా గాయపడగా వారిని స్థానికులు 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలకు కార్మిక సంఘాలను ఆహ్వానించాలి

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సింగరేణిలో అన్ని ట్రేడ్ యూనియన్లను ఆహ్వానించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, ఏరియా మాజీ వైస్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణిలో జరిగే తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం గుర్తింపు పత్రం ఇవ్వనందున, అన్ని ట్రేడ్ యూనియన్ లను సమానంగా చూస్తూ అందర్నీ ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం జరిగినటువంటి రాష్ట్ర అవతరణ ఉత్సవాలుకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గుర్తింపు కాలపరిమితి అయిపోయినందువలన అన్ని ట్రేడ్ యూనియన్ నాయకులను ఆహ్వానించారని ఇట్టి విషయాన్ని సింగరేణి యాజమాన్యం గుర్తుఎరిగి పారిశ్రామిక శాంతిని నెలకొల్పాలని పేర్కొన్నారు.

ఆర్థిక తోడ్పాటు అందించిన స్నేహితులు

నవతెలంగాణ-జైపూర్

అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుని తండ్రి మృతి చెందినట్లు తెలిసిన తోటి స్నేహితులు ఆర్థిక తోడ్పాటు అందించారు. జైపూర్ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల 1996-97 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు శుక్రవారం పౌనూరులో ఉంటున్న స్నేహితుడు మధుకర్‌ను కలిసి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 1996-97 స్నేహితులు కటుకూరి సత్యం, గుండు తిరుపతి, మద్దుల సురేందర్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాచర్ల సతీష్, మల్లేష్, రాజన్న, సాయిబాబా ఉన్నారు.

సంఘవిద్రోహ శక్తులతో పోరాడి కీలకంగా విధుల నిర్వహణ

- ఎస్పీ గౌస్ ఆలం
- పదవీ విరమణ పొందిన అధికారులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పోలీసు వ్యవస్థ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సంఘవిద్రోహశక్తులతో పోరాడి కీలకంగా విధులను నిర్వర్తించి, ప్రస్తుతం పోలీసు వ్యవస్థ ప్రశాంతంగా ఉండటానికి గల కారణమైన సిబ్బందికి జిల్లా ఎస్పీ గౌస్ ఆలం కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని పదవీ విరమణ పొందుతున్న నలుగురు పోలీసు అధికారుల కుటుంబ సభ్యులతో కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికను ప్రధానం చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

నలుగురు పోలీస్ అధికారుల పదవీ విరమణ...

ఎన్.పోశెట్టి అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్, 1982 సంవత్సరంలో పోలీసు డిపార్ట్‌మెంట్‌లోకి కానిస్టేబుల్‌గా వచ్చి అంచలంచలుగా 2012 సంవత్సరం హెడ్ కానిస్టేబుల్, 2018 సంవత్సరం అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి పొందారు. పి.ధామస్ అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్, 1989 సంవత్సరంలో పోలీస్ కానిస్టేబుల్‌గా ప్రస్థానం మొదలుపెట్టి 2011లో హెడ్ కానిస్టేబుల్‌గా 2016లో ఏఎస్ఐగా పదోన్నతి పొంది, సర్వీసులోని 35 సంవత్సరములు ఉమ్మడి జిల్లాలో విధులను నిర్వర్తించారు. ఎస్.ప్రేమ్‌సింగ్ హెడ్ కానిస్టేబుల్, డీసీఆర్బి1990 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా పోలీసు వ్యవస్థలోకి అడుగుపెట్టి 2014 సంవత్సరంలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. జి.హిరాజి 1989 సంవత్సరం నుంచి పోలీస్ కానిస్టేబుల్‌గా ఉమ్మడి జిల్లాలో గల వివిధ పోలీస్ స్టేషన్‌లో విధులను నిర్వర్తించారు.

విధులు నిర్వర్తించడంలో కుటుంబ ప్రోత్సాహం...

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు పోలీసు వ్యవస్థను సేవలందించి, పదవీ విరమణ పొందుతున్నందుకు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి, ఉన్నత స్థానాలకు ఎదగగలరని తెలియజేశారు. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించాలని సిబ్బందికి తెలియజేశారు. ఎటువంటి అవసరం ఉన్న జిల్లా పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. పదవీ విరమణ పొందిన అధికారులను ప్రభుత్వ వాహనంలో ఇంటి వరకు సాగనంపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన బి.సురేందర్‌రావు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నవీన్, సీసీ దుర్గం శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, పదవీ విరమణ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

